# నానాటి బతుకు

అర్ధరాత్రి పన్నెండైనా వినాయకరావుకి నిద్ర పట్టడం లేదు. "క్షణం విత్తం, క్షణం చిత్తం, క్షణం జీవితమానయోః యమన్య కరుణా నాస్తి తస్మాత్ జాగ్రత్త జాగ్రత్త" అంటూ క్రితం రోజు రాత్రి శివాలయంలోని వేదాంతి ఉపన్యాసంతో అతడిలో హఠాత్తుగా అర్ధరహితమైన మృత్యుభయం ప్రారంభమయింది.

తన యాభయ్యేళ్ళ జీవితంలో చావు గురించి అంత తీవ్రంగా ఆలోచించలేదు. మనసు లయ తప్పుతోంది. అర్థం కాని ఆలోచనలు. తను ఎలా చనిపోతాడూ? జబ్బొచ్చా? ఏ లారీవాడో, స్కూటర్‌వాలాయో గుద్దేస్తాడా? అలా కాకుండా ఏ నిద్దర్లోనో హార్ట్ ఎటాక్‌తో చనిపోతాడా?

నిద్ర కరువైన కళ్ళ ముందు బాల్యం సాక్షాత్కరించింది. పుట్టక మునుపే తండ్రి చనిపోయాడు. పురిటి మంచం మీదే తల్లి తండ్రితోవ చూసుకుంది. పదేళ్ళ వచ్చే వరకూ గాలికి తిరిగాడు. ఇంట్లో పని పాటలకు ఉపయోగపడతాడనే వ్యాపార దృక్పథంతో మేనమామ చేరదీశాడు.

మేనమామకు వరసగా కూతుర్లు పుట్టడంతో, కట్నం బాధ ఒక కూతురికి తగ్గుతుంది కదా అని మెట్రిక్యులేషన్ చదువుతోపాటు, టైపు నేర్పించి ఒక ఆఫీసులో గుమస్తాగా వేయించాడు. భార్య కాపురానికి వచ్చేసరికి పదిహేను సంవత్సరాల పిల్ల. అతడి వయసులో సగం దురదృష్టం కొద్దీ పదేళ్ళ వరకూ కలగలేదు సంతానం.

ఆ తర్వాతే ఇద్దరు ఆడనలుసులు కవలలుగా పుట్టారు. వారితో ఆశ తీరక కొడుకు కోసం చూసేసరికి ఇద్దరు కూతుళ్ళు పుట్టేసి గుండెల మీద కుంపట్లయిపోయారు. పదేళ్ళ వయసు నుంచి పదహారేళ్ళ వయసున్న ఆడపిల్లలు వరుసగా నలుగురు. వారి తర్వాత తల కొరివి పెట్టడానికి అయిదేళ్ళవాడు.

ఇప్పుడు వినాయకరావు భయపడటానికి కారణం తను సడన్‌గా చనిపోతే శవాన్ని ముందేసుకుని ఆడపిల్లలతో, చిన్న కుర్రాడితో భార్య ఎన్ని బాధలు పడుతుందో? దూరాన ఉన్న బావమరుదులకు టెలిగ్రాములు ఎవరు కొడతారు? ఇవే ఆలోచనలు. అసలు తను శివాలయంలో పురాణ శ్రవణానికి వెళ్ళకుండా ఉంటే బావుండేది. మనసులో బాధ తీవ్రతరమైంది.

గదిలో బెడ్‌లైట్ గుడ్డిగా వెలుగుతోంది. సున్నం వేసిన గది గోడలు పెచ్చులూడి వార్ధక్యంలో ముసలి చర్మాన్ని గుర్తుకు తెస్తున్నాయి. "తను ముసలాడయితే తన చర్మం కూడా అలా తయారవుతుంది కాబోలు? అసలు తనకు యాభయ్యేళ్ళొచ్చాయి. ముసలితనం సంప్రాప్తిచినట్టే" ఏదో తెలియని దిగులు గుండెల్ని పిండేస్తోంది. పక్కనే పడుకున్న చంటాడు నిద్దట్లో మరింత దగ్గరగా జరిగాడు. కళ్ళంట నీళ్ళు తిరిగి వాణ్ణి గట్టిగా హత్తుకున్నాడు. పక్కనే మంచంమీద ప్రశాంతంగా నిద్రపోతున్న భార్య ముప్పయిదేళ్ళకే ఆమెలో వయసు మీరిన పెద్దరికం వచ్చేసినట్టుంది. ఆమెకు చెరో వైపు పడుకున్న ఇద్దరాడపిల్లలు, పెద్ద వాళ్ళిద్దరి చదువు బాధ్యత బావమరిది తీసుకోవడంతో సగం భారం తగ్గింది. వాళ్ళను చూస్తూనే అలా నిద్రలోకి జారుకున్నాడు.

* * * * *

ఉదయం ఎనిమిదైనా నిద్ర లేవలేకపోయాడు. రాత్రంతా భయంకరమైన కలలు. శ్మశానంలో కాలుతున్నట్లు, కొడుకు తెల్ల ధోవతితో తన చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నట్లు, క్షణం క్షణం అతడికి చావు భయం అధిక మవుతోంది. అది తప్పదనే నిజం మింగుడుపడటం లేదు. ఉదయంపూట దైనందిన కార్యాలు నిర్లిప్తంగా పూర్తి

చేశాడు. ఆ రోజు సెలవు పెట్టి ఇంట్లోనే కూర్చుందామనుకున్నాడు. అది జీతాలిచ్చే రోజు. గుమాస్తా అవసరం అనివార్యం. ఇక తప్పదని బయలుదేరాడు. ఆఫీసు ఫైళ్ళలో తలదూర్చినా ఏకాగ్రత లేకపోవడంతో డ్రాఫ్టల నిండా తప్పులు రాశాడు. "ఇంత సర్వీసు పెట్టుకుని ఏమిటయ్యా ఆ తప్పులు?" చండశాసనుడైన ఆఫీసరు కాగితాలు విసిరికొట్టాడు. 'ఒరేయ్! నీకు కూడా చావు తప్పదురా' అనుకుంటూ తలొంచుకుని వచ్చేశాడు. తనకు హఠాత్తుగా ఆవిర్భవించిన చావు భయం గురించి ఎవరికైనా చెపుదామనుకున్నాడు. వేళాకోళం చేస్తారని భయపడ్డాడు. అయినా ధైర్యం చేసి డొంక తిరుగుడుగా అడిగాడు.

"చావు గురించి మీ రేమనుకుంటున్నారు? నేను రాత్రి చావు మీద ఒక గొప్ప వేదాంత గ్రంథం చదివాను. ఇంతకీ మీ అనుభవంలో చావంటే ఏమిటీ" ఇలా ప్రశ్నించాడు, ఆఫీసులో లంచ్ అవర్‌లో తనకు ఎదురుపడ్డవాళ్ళని రహస్యంగా.

"రక్తనాడులు స్తంభించి, గుండె నిర్దయగా వీడ్కోలు చెప్పి, శ్వాస సెలవు తీసుకుంటుంది, ఆత్మీయులు గొల్లు మంటారు." ఆఫీసులోని ఓ ఆధునిక కవి కవిత్వీకరించాడు.

"జీవితాంతం వరకూ ఎలాగూ ఉపయోగపడలేని దేహాన్ని చని పోయిన తర్వాత కళ్ళు ఐ బాంక్ కి, ఒళ్ళు హాస్పిటల్‌కు దానం చేయాలి." ఓం ఫిలాంత్రోఫిస్ట్ ఆదర్శం పలికాడు.

"మృత్యుదేవత బిచ్చగత్తెలా నా ఇంటి తలుపు తట్టినపుడు నేను దాన్ని ఒట్టి చేతులతో పంపను" టాగూర్‌ను మననం చేసుకున్నాడొక భావుకుడు.

"పాత చొక్కా విడిచి, కొత్త చొక్కా తొడుక్కోవడం" రీ బర్త్‌ని నమ్మే ఒక వ్యక్తి వ్యక్తపరచాడు.

"బాధలతో విసిగి వేసారే ఒక దుర్బలుడుకి విశ్రాంతి" ఓ నిరాశావాది నిట్టూర్పు విడిచాడు.

"చనిపోయిన మనిషి దేవుడిని చేరడం 'ట్రాష్'." "భూమిలో పాప్రోఫైటిక్ రియాక్షన్‌తో నక్షత్రజని చక్రానికి నాంది పలుకుతాడు" ఓ సైన్స్ సిద్ధాంతి సిద్ధాంతీకరించాడు.

ఇలా చావును గురించి ఏవేవో వివరణలు, నిర్వచనాలు ఇచ్చారే తప్ప ఎవరూ అతడికి అర్ధాంతరంగా కలిగిన మృత్యుభయాన్ని పోగొట్టలేకపోయారు.

ఆ సమయంలో అతడికి జ్ఞానమూర్తి గుర్తు కొచ్చాడు. మనసులో ఒకసారి ఏదో ఊరట కలిగినట్లనిపించింది.

జ్ఞానమూర్తి ఒక మహత్తరమైన వ్యక్తి అతని దృష్టిలో. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న తల్లి, పెళ్ళయినా కట్నం చాలలేదని కూతుళ్ళను సతాయించే అల్లుళ్ళు, ఆదర్శాల్ని అమాయకత్వంగా పరిగణించి, అభాసుపాలుచేసే బంధువులు ఇలా గుండెలో ఎన్ని అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నా, లోకం అంతా దగా చేసి పోతున్నా చలించనివాడు, చిరునవ్వు చిందించేవాడు అయిన జ్ఞానమూర్తి అంటే వినాయక రావుకు ప్రాణం. ఆ ఊరికి యాభై కిలోమీటర్ల దూరంలో తన స్వగ్రామంలో ఎలిమెంటరీ స్కూల్లో పనిచేస్తున్న జ్ఞానమూర్తిని కలవడానికి బయలు దేరాడు.

బస్‌స్టాండ్‌లో జ్ఞానమూర్తికి ఇష్టమైన స్వీట్లు, అమృతపాణి అరటిపళ్ళు కొని పేక్ చేయించుకున్నాడు. అయిదు నెలలు పైగానే అయింది అతణ్ణి కలిసి, కలిసినప్పుడల్లా ఏవో ఒకటి పట్టుకెళుతూ ఉంటాడు. "ఏమోయ్ వినాయకం! నన్ను మరీ పిల్లాడిని చేసేస్తున్నావ్!" అంటూ ఆబగా తింటాడు తన కళ్ళముందే వాటిని.

ఆలోచనలతో బస్సు ఎక్కాడు. ప్రయాణికుల్ని పరిశీలించాడు. యువకులు, మహిళలు, ముసలాళ్ళు, పిల్లలు మొత్తం ఒక ముప్పైమంది ఉంటారు. "కొంపదీసి ఈ బస్సు తిరగబడితే అందరూ చచ్చిపోవాలి కాబోలు", భయం విచిత్రంగా మొదలయ్యింది అతనిలో. బస్సు ఆపితే దిగి వెళ్ళి పోదామనుకున్నాడు. అప్పటికే బస్సు అతి స్పీడుగా ఊరి పొలిమేరలు దాటింది. ఈ సమయంలో ఆపితే ప్రయాణికులు

తన్నడం ఖాయం అనుకుని సమాధానపడి ఊరుకున్నాడు.

"కృష్ణాపురం! దిగండి! దిగండి!" అనే కేక వినబడేవరకూ అతనీలోకంలో లేడు.

బస్సు దిగాడు, నడావలనిపించలేదు. రిక్షా కనిపిస్తే వెంటనే ఎక్కి "ఎలిమెంటరీ స్కూల్ టీచర్ జ్ఞానమూర్తి ఇంటికి పోనీయవోయ్!" అన్నాడు. రిక్షావాడు బేరం ఆడకుండా మౌనంగా తొక్కుతున్నాడు.

"ఏం బాబూ ఎంతిమ్మంటావ్?" మాట వరసకి అడిగాడు.

"మీకు తోచినంత బాబూ!" అని నిర్లిప్తంగా ఉండిపోయాడు రిక్షావాడు. ఇద్దరి మధ్యా అయిదు నిముషాలు సేపు మాటల్లేవు.

"ధర్మరాజులాంటోడు. కాలం చెల్లిపోయింది." నిట్టూర్పు విడిచాడు రిక్షావాలా.

"ఏమిటోయ్ నువ్వు అనేది?" కంగారు పడ్డాడు వినాయకరావు అర్థంకాక.

"ఇంకేటి బాబూ! పుణ్యాత్ముల్నే కదా ఆ దేవుడు లాక్కునేది. అర్ని అర్థాంతరంగా లాక్కుపోయాడు."

గుండెల్లో దడ పెరిగి "జ్ఞానమూర్తి చచ్చిపోయాడా?" గట్టిగా అరిచాడు.

"అవును బాబూ! ఓ రోజు రాత్రి చాలా గుండె నొప్పి వచ్చిందట. నేనే ఇదే రిక్షాలో తీసుకెళ్ళాను. హాస్పిటల్ గేటు ముందే చనిపోయాడు బాబూ!" గుడ్లలో నీరు కక్కుకున్నాడు రిక్షావాలా.

అప్పటికే రిక్షా జ్ఞానమూర్తి ఇల్లు సమీపించింది. వినాయకరావు రిక్షాలోంచి దూకి గబగబా ఇంట్లోకి నడిచాడు. ముందు గదిలో దండవేయబడిన నిలువెత్తు ఫోటోలో నవ్వుతూ జ్ఞానమూర్తి. ఇంట్లో చాలా సందడిగా ఉంది. అతన్నెవరూ గుర్తించినట్లు లేదు. ఒక గదిలో ఆడవాళ్ళు, మగవాళ్ళు నవ్వుతూ గట్టిగా

మాట్లాడుకుంటున్నారు.

'మనిషి చనిపోయి నెల కాలేదు! వీళ్ళంతా ప్రశాంతంగా ఎలా ఉండగలుగుతున్నారబ్బా!' అనుకున్నాడు.

చిన్నపిల్లలు గుంపులు గుంపులుగా చేరి గోలగోలగా తిరుగుతున్నారు. పాపం! వీళ్ళకి. ఆ పెద్దోళ్ళకి కూడా చావు భయం లేనట్లుంది అనుకుంటూ అలానే నిలుచుండిపోయాడు. అతన్ని చూసి ఓ కుర్రాడు పరుగెత్తుకుంటూ వచ్చాడు. అతడి చేతిలో క్రికెట్ బాట్. "మీ అమ్మగారు లేరా?" అన్నాడు ఆ కుర్రాడిని జ్ఞానమూర్తి కొడుకుగా గుర్తించి.

"లేరండి! పోస్టాఫీసు కెళ్ళారు సేవింగ్ సర్టిఫికెట్లు మార్చడానికి" అంటూ ఆ కుర్రాడు వెళ్ళిపోయాడు.

తన చేతిలో ఉన్న స్వీట్లు పాకెట్, అరటిపళ్ళు అతడికి ఇవ్వబోయి, ఎదురుగా ఉన్న జ్ఞానమూర్తి ఫోటో కేసి చూస్తూ బావురు మన్నాడు.

లోపలి కెళ్ళిన కుర్రాడు ఒక వ్యక్తితో మళ్ళీ వచ్చాడు. అతను జ్ఞానమూర్తి తమ్ముడు. అంతవరకూ నిలుచున్న వినాయకరావుని "కూర్చోండి సార్!" అన్నాడు.

కూర్చుంటూ, ఏం మాట్లాడాలో తెలియక తలొంచుకున్నాడు.

"మమ్మల్ని ఇబ్బందుల్లో పడేసి అన్నయ్య హాయిగా వెళ్ళిపోయాడండి! హార్ట్ ఎటాక్‌తో పోయాడని అంతా అనుకుంటున్నారు. కానీ...." అతను చెపుతున్న మాటలు వినాయకరావుకు వినపడటం లేదు.

"మరీ ఇంత పిరికిపని చేస్తాడని మేం అనుకోలేదండి! అయన కాలధర్మం చెందినా మా ధర్మం మేం నిర్వర్తిస్తాం. అన్నట్టు మీ కోలెటర్ రాసి పోస్ట్ చేయకుండా మరిచిపోయాడండి అన్నయ్య. ఇదిగో!" అంటూ జ్ఞానమూర్తి తమ్ముడు అందించిన కవర్ అందుకుంటూ, అక్కడ ఒక్క క్షణం ఉండడానికి భయమేసి వేగంగా కదిలాడు.

అలా పరుగెడుతున్న వినాయకరావును చూసి "ఆగండి! ఆగండి!" అంటున్నా చాలా దూరం వచ్చేశాడు. గబగబా కవరు చింపి, లెటర్ చదువుతున్నాడు. తాను పుట్టింది మొదలు తాను ఏ రకమైన సమస్యల వలయంలో ఇరుక్కున్నదీ వివరిస్తూ, చివరగా,

"చావెప్పుడూ భయంకరం కాదు. వాస్తవానికి చనిపోయే వరకూ బ్రతకడం కోసం మనిషిపడే తపన, పోరాటమూ ఇవే అతి భయంకరమైనవి." అన్న జ్ఞానమూర్తి ఆఖరి సందేశం చదువుకుని బ్రతికుండగా ఎన్నో జీవిత సత్యాలు బోధించిన జ్ఞానమూర్తి చనిపోతూ కూడా ఒక ధర్మసూత్రం చేసిపోయాడు. కాలధర్మం చెందేవరకూ నా ధర్మం నెరవేర్చాలి సుమా అనుకుని ముందుకు సాగిపోయాడు వినాయకరావు.

– ఆంధ్రప్రభ,

– సాహిత్య అకాడమీవారి ఒకతరం తెలుగుకథ కథాసంకలనంలో పునర్ముద్రితం

తిరిగి వారు ప్రచురించిన కన్నడ తమిళ సంకలనాలలో, ప్రచురితం

* * * * *